సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కాలువలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు



బాజీ జంక్షన్‌లో పారిశుధ్యంపై ఆరా తీస్తున్న జెడ్సీ శంకరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ జోన్–8 పరిధిలో ఫుట్‌పాత్‌లు, కాలువలు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని జోన్–8 జెడ్సీ శంకరరావు అన్నారు. ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. వంటిల్లు, ఎన్‌ఎస్‌టీఎల్ 80అడుగుల రహదారి, బీఆర్‌టీఎస్ రహదారిలో దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించవద్దన్నారు. ఎన్‌ఏడీ నుంచి విమాన్‌నగర్ రోడ్డుకు ఇరువైపులా చెత్త లేకుండా చూడాలని ఆయా వార్డుల ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా జరిగేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శులు, శానటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



కుట్టు మిషన్ శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న మహిళలు

సింధియా: కుట్టు శిక్షణ నేర్చుకుంటే స్వయం ఉపాధి పొందవచ్చునని శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ బాలకృష్ణ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ మొదటి బ్యాచ్ 100 రోజుల తరగతులను పార్వతి, కుసుమ ఆధ్వర్యంలో దిగ్విజయంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా శిక్షకులను మజ్జి మాలినాయుడు తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గంగాధర్, చందు, మహిళలు పాల్గొన్నారు.


మహిళలను వేధిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కి) ఫ్లో సహకారంతో వాల్తేర్ డివిజన్ సాలగ్రామపురంలోని సాగరమాల ఆడిటోరియంలో ప్రత్యేక అవగాహన సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా హాజరై మాట్లాడారు. మహిళా సిబ్బంది కోసం పలు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలపై ఎటువంటి లైంగిక వేధింపులు జరిగినా అందుకు కారకులను వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో గల పలు యూనిట్లలో మహిళలకు ప్రత్యేక రెస్ట్‌రూంలు, వాష్‌రూం, లాకర్స్, చేంజింగ్ రూంలు ఏర్పాటు చేయాలని సీనియర్ డీఈఎన్‌లను ఆదేశించినట్లు తెలిపారు. ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రా మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం ఈకార్వో ముందుంటుందని తెలిపారు. అంబ్రీన్ అంజుమ్ (ఫౌండర్, ఫిక్కిఫ్లో విజయవాడ చాప్టర్), డాక్టర్ వై.హేమ (మెంటార్, ట్రైనర్, ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్, 'పోష్'), వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారి పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఓల్డ్ ఐటీఐకి.. మహర్దశ

- కేంద్ర ప్రభుత్వ ఉపాధి శిక్షణకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక
- దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలకు రూ. 60 వేల కోట్ల మంజూరు
- అక్టోబర్ 2న హబ్ స్పోక్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న ప్రధాని మోదీ

కంచరపాలెం: పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఓల్డ్ ఐటీఐ)కి మంచి రోజులు రానున్నాయి. ఐటీఐల్లో ఉపాధి శిక్షణ కల్పనకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద కంచరపాలెం ఓల్డ్ ఐటీఐని ఎంపిక చేసింది. ఓల్డ్ ఐటీఐ ఉత్తీర్ణతలో, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు చూపడంలో నంబర్ వన్ స్థానంలో నిలవడంతో కేంద్రం ప్రభుత్వ అవార్డులు అందుతున్నాయి.

25 ఏళ్ల క్రితం పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో (ఐటీఐ) చదివిన విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉండేది. ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు సులువుగా లభించేవి. రైల్వే, ఏపీఎస్ఆర్‌టీసీ, స్టీల్‌ప్లాంట్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్, బీహెచ్‌పీవీ, డాక్‌యార్డ్, షిప్‌యార్డ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభించేవి. అనాడు ఐటీఐ చేసి వెంటనే అప్రెంటిస్ చేసిన విద్యార్థులు ఇట్టే కొలువులు సంపాదించేవారు. నేటి కాలంలో ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వ రంగ సంస్థలు అడుగులు వేయడంతో ఉపాధి–ఉద్యోగావకాశాలు ప్రశ్నార్థకంగా మారాయి. రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు పెరగడంతో చాలా మంది విద్యార్థులు ఐటీఐల వైపు వెళ్లకుండా, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంల్లో తప్పితే ప్రైవేటు ఐటీఐల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. నేడు ఇలాంటి పరిస్థితులకు స్వస్తి పలికేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు శుభ వార్త చెప్పింది. విశాఖలో ప్రభుత్వ పాత ఐటీఐ స్వరూపం మరికొద్ది రోజుల్లో మారనుంది. కేంద్ర ప్రభుత్వం ఐటీఐలను ఆధునికీకరించి, అక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో సుమారు 81 ప్రభుత్వ ఐటీఐలు ఉండగా కేంద్ర ప్రభుత్వం విశాఖలోని కంచరపాలెం పాత ఐటీఐని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. దీనిలో భాగంగా కంచరపాలెం పాత ఐటీఐకు రూ. 81 కోట్ల నిధులను మంజూరు చేయనున్నది. ఈ ప్రాజెక్ట్‌ను అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున కేంద్ర ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ తెలిపారు.



కంచరపాలెంలోని ఓల్డ్ ఐటీఐ

పాత ఐటీఐకి ప్రథమ స్థానం..

కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ దక్షిణ భారత దేశంలోనే ఉత్తమ పారిశ్రామిక శిక్షణ సంస్థగా గుర్తింపు పొంది ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రులు జయంత్ చౌదరి, **సుకంతా ముజుందార్ చేతుల మీదుగా ఉపాధి, పారిశ్రామిక శిక్షణ శాఖ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం, కంచరపాలెం** పాత ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ విజయానికి శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది తోడ్పాటు కారణమన్నారు.

ఐటీఐలకు మంచి రోజులు..



ఐటీఐలకు త్వరలో మంచి రోజులు రానున్నాయి. కంచరపాలెంలోని పాత ఐటీఐకి ఎంతో చరిత్ర ఉంది. రాష్ట్రంలో ఓల్డ్ ఐటీఐ ఉత్తీర్ణతలోనూ, ఉపాధి కల్పించడంలోనూ నంబర్–1 స్థానంలో ఉంది. ఐటీఐలలో మెరుగైన శిక్షణ ఇచ్చి, యువతకు ఉపాధి కల్పించడానికి ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం కింద నాలుగు కొత్త ట్రేడ్లతో పాటు మరో 10 ట్రేడ్లను గుర్తించి శిక్షణ ఇస్తాం. కేంద్రం 50 శాతం, రాష్ట్రం 33 శాతం, పరిశ్రమలు 17 శాతం నిధులు మంజూరు చేస్తాయి.

– జె.శ్రీకాంత్, కన్వీనర్, ప్రిన్సిపాల్, పాత ఐటీఐ కంచరపాలెం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు. పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్



అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్ (ఫైల్)



కేంద్ర ప్రభుత్వం నుంచి ఐటీఐకి వచ్చిన అవార్డులు

గోపాలపట్నంలో కార్డన్‌సెర్చ్



గోపాలపట్నంలో జల్లెడపడుతున్న పోలీసులు

గోపాలపట్నం: గోపాలపట్నం, లక్ష్మీనగర్ ప్రాంతంలో మంగళవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ చేపట్టారు. లక్ష్మీనగర్ ప్రాంతంలో అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రెండు చోట్ల మద్యం విక్రయిస్తున్న నిర్వాహకుల నుంచి 17 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీరు అక్రమంగా మద్యం నిల్వ చేసి అమ్మకాలు చేస్తుండడంతో అదుపులోకి తీసుకున్నారు. సంఘ విద్రోహక కార్యకలాపాలు వంటివి చేయరాదని హెచ్చరించారు. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాల సమస్యపై ఆప్కాస్ ఎండీకి వినతి



ఆప్కాస్ ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక: జీవీఎంసీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల మిస్సింగ్ జీతాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ఆప్కాస్ ఎండీకి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. 2022 ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది జులై వరకు 50 మంది కార్మికులకు జీతాలు మిస్సయ్యాయని యూనియన్ నాయకులు గొలగాని టి.నూకరాజు, గొలగాని అప్పారావు ఈ సందర్భంగా ఎండీకి వివరించారు. ఈ సమస్య ప్రతినెలా ఉత్పన్నమవుతోందని పేర్కొన్నారు. దీనిపై దృష్టి సారించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు నక్క నాగరాజు, శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

గాయత్రీదేవిగా దుర్గామాత

- కనులపండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- రెండోరోజు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మల్కాపురం గొల్లవీధి వద్ద పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జ్ దేవన్‌రెడ్డి



మల్కాపురం పల్లివీధిలో విజయవాడ కనకదుర్గమ్మగా ..



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద మహాచండీ యాగం నిర్వహణ, అమ్మవారికి ప్రసాదం నివేదన



గాయత్రీదేవిగా దుర్గమ్మతల్లి



గాయత్రీదేవి అలంకరణలో దుర్గమ్మ



కొత్తపాలెం దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు

మల్కాపురం: దుర్గమ్మ గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన దుర్గాదేవిని రెండో రోజు గాయత్రీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

వైభవంగా మహా చండీయాగం

గాజువాక ఆర్టీసీ డిపో వద్ద దుర్గాదేవిని గాయత్రీదేవిగా కొలువుదీర్చారు. అమ్మవారికి మల్లెల మాలను అలంకరించి, జామకాయ, దద్దోజనం వంటి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. ఇక్కడ మహా చండీయాగం నిర్వహించారు. స్థానిక మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో కలశాలను తలపై పెట్టుకుని చండీయాగం వద్దకు వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

– 58వ వార్డు ములగాడ వద్ద నెలకొల్పిన దుర్గాదేవి గాయత్రి అవతారంలో దర్శనమిచ్చారు. స్థానిక మహిళలు పీఠం వద్ద పారాయణం చేశారు.

ఇంద్రకీలాద్రి దుర్గమ్మగా..

- 61వ వార్డు మల్కాపురం పల్లివీధి వద్ద విజయ బాల మిత్ర సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి పూజల్లో స్థానిక భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కీర్తనలను ఆలపించారు. ఇక్కడ మండపం వద్ద అమ్మవారిని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మగా కొలువుదీర్చి, పూజలు చేశారు.
- ఇదే వార్డు మల్కాపురం, గొల్లవీధి వద్ద అల్లరి యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి పూజలు జరిగాయి.ఈ పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు బొట్ట వెంకటప్పారావుయాదవ్ (బొట్ట చిన్నా), దాడి బాలకృష్ణ, నమ్మి శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెం ఆలయంలో..

గోపాలపట్నం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. కొత్తపాలెం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌ను గాయత్రీ దేవిగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు, అభిషేకాలు అర్చనలు చేశారు. సామూహిక కుంకుమార్చనలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అలాగే కరాసా, బుచ్చిరాజుపాలెం బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయాల్లో అమ్మవారి నామ స్మరణ హోరెత్తింది.

కురిసిన వాన.. రోడ్డెక్కిన వ్యర్థాలు



మల్కాపురం సర్వీసురోడ్డులో నిలిచిన వర్షపు నీరు



సేవా మార్గంలో వ్యర్థాలు

మల్కాపురం: చిన్నపాటి వర్షం కురిసినా పారిశ్రామిక ప్రాంతంలో వ్యర్థాలు రోడ్డెక్కడం పరిపాటిగా మారింది. కాలువల్లో వ్యర్థాలు సకాలంలో తొలగించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న వర్షాలకు పలు సేవా మార్గాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల చిన్నపాటి చెరువులను తలపించాయి. కాలువల్లోని వ్యర్థాలు సేవా మార్గంపైకి చేరడంతో అవస్థలకు గురయ్యారు.

'మరుగు'న పడేశారు



మర్రిపాలెం రైతుబజారు వద్ద మూతపడిన మరుగుదొడ్డి

గోపాలపట్నం: ప్రజల సౌకర్యం కోసం పారిశ్రామిక వేత్తల సహకారంతో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. మర్రిపాలెం వుడా లేఅవుట్ రైతుబజారు వద్ద ఉన్న మరుగుదొడ్డి పరిస్థితి అలానే ఉంది. సుమారు ఆరేళ్ల క్రితం ఎన్‌ఏడీ ప్రాంతంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మూడేళ్లు పని చేసిన తరువాత ఇది మూతపడింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సౌజన్యంతో కంటైనర్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. 52వ వార్డు పరిధిలో మర్రిపాలెం రైతుబజారు వద్ద, ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద కంటైనర్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అయితే, చిన్నచిన్న మరమ్మతులతో ఎన్‌ఏడీ వద్ద మరుగుదొడ్డి ఉపయోగపడుతున్నా.. మర్రిపాలెం రైతుబజారు వద్ద మాత్రం పూర్తిగా మూతపడి పోయింది. ఆ ప్రాంతంలోని రైతుబజారు, పాస్‌పోర్టు ఆఫీసులకు వచ్చేవారికి ఈ టాయిలెట్ ఎంతో ఉపయోగపడేది. ఎన్‌ఏడీ దాటిన తర్వాత ఎక్కడా మరుగుదొడ్డి సదుపాయం లేదని, దీనిని బాగు చేసి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఫైలేరియాపై అప్రమత్తత అవసరం



ఫైలేరియా వ్యాధిగ్రస్తురాలికి జాగ్రత్తలు సూచిస్తున్న వైద్యులు

మల్కాపురం: ఫైలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా విభాగం హెల్త్ సూపర్‌వైజర్ బొడ్డేటి సూర్యనారాయణ సూచించారు. ఫైలేరియా వ్యాధి ఎలా వస్తుంది? ఆ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై యూపీహెచ్‌సీ వైద్యాధికారి సాయిసుజీత్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యూలెక్స్ అనే దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుందని, ఈ దోమ డ్రైనేజీల్లో ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టుపక్కల కాలువలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఈ దోమలు దరి చేరవన్నారు. 60వ వార్డు ఇందిరాకాలనీ వద్ద 4, 63వ వార్డు క్రాంతినగర్ వద్ద 1 ఫైలేరియా కేసు ఉన్నాయని, అవి కూడా పాత కేసులే అని వివరించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు ఫైలేరియా మార్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మలేరియా విభాగ సూపర్‌వైజర్ డి.శ్రీనివాస్‌రావు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సమావేశాలు



మాట్లాడుతున్న రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ సాహు

తాటిచెట్లపాలెం: సోమవారం ప్రారంభమైన ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 11వ ద్వైవార్షిక సమావేశాలు మంగళవారంతో ముగిసాయి. వర్కింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశాలతో పాటు డెలిగేట్ సెషన్ కూడా జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. శ్రామిక్ కాంగ్రెస్ ఎల్లవేళలా కార్మికుల పక్షాన ఉంటుందని, అన్ని వేళల్లో ముందుండి నడిపించే నాయకుడు జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్ నాయకత్వంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో ట్రేడ్ యూనియన్‌లో నంబర్ –1గా నిలబెట్టారని ప్రశంసించారు. జోనల్ ప్రెసిడెంట్ జె. సంపత్‌కుమార్ మాట్లాడుతూ 8వ పే కమీషన్ ఏర్పాటు, అమలు, కరోనా సమయంలో 18 నెలల డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని యాజమాన్యాన్ని కోరుతున్నట్లు తెలిపారు. మహిళలకు చైల్డ్‌కేర్ లీవ్, విధి నిర్వహణ ప్రాంతాల్లో వాష్‌రూంలు, రెస్ట్‌రూంలు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. రన్నింగ్ స్టాఫ్ ప్రధాన సమస్య మినిమం గ్యారంటీ కిలోమీటర్లపై యూనియన్ ఆమరణ దీక్షలు చేపట్టిందని, దీని ఫలితంగా అధికారులు, యాజమాన్యం చర్చించి సానుకూలంగా స్పందించినట్లు వీరు తెలిపారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. నరసింగరావు, వాల్తేర్ డివిజన్, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి. మాళేశ్వర్రావు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్ వెంకట్రావు, కేంద్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరావు, ఆయా డివిజన్ల కేంద్ర కార్యవర్గ సభ్యులు, యూనియన్ నాయకులు, రైల్వే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ చరిత్రను గ్రంథస్థం చేయాలి



సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ చారిత్రక వికాసాన్ని గ్రంథస్థం చేయాలని కేంద్ర ప్రభుత్వ అడ్మినిస్ట్రేటివ్ పబ్లిక్ గ్రీవెన్స్ విభాగం కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి వి.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్ దృష్టితో ముందుకు సాగాలని సూచించారు. చరిత్రకారులు, విశిష్ట ఆచార్యులను సంప్రదించి ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రగతి, వికాసాలను గ్రంథంగా తీసుకొస్తే భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా విశ్వవిద్యాలయాన్ని రానున్న 50 ఏళ్లలో ఏవిధంగా అభివృద్ధి చేయాలి.., ఏ దిశగా నడిపించాలనే అంశాలపై ఒక విజన్ సిద్ధం చేయాలని సూచించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఏయూ నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆచార్యులు నిరంతరం పరిశోధనలు జరపడం, పరిశోధనా పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించడం విధిగా భావించాలన్నారు. అదేవిధంగా ఒక ప్రత్యేకమైన స్టడీ గ్రూపులను రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ ప్రాంతంతో తన చిన్నతనంలో ఉన్న అనుబంధాన్ని, విశాఖలో చదువుకున్న రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఆచార్యులను ఉద్దేశించి శ్రీనివాస్ ప్రసంగించడం సంతోషకరమన్నారు. అనంతరం సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com